సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 20 । సెప్టెంబర్ । 2024



విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. -8లో



హోంగార్డ్స్ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

హోమ్ గార్డ్స్ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని రాయలసీమ రీజినల్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం. మహేష్ కుమార్ అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)


	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.430	రూ.520
రెండోరకం	రూ.340	రూ.420

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 105 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

21న జిల్లా ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులు హాజరుకావాలి



మదనపల్లె సిటీ: ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్–17 బాలుర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 21వతేదీన మదనపల్లె సమీపంలోని వేద ఇంగ్లీషు మీడియం పాఠశాల వద్దకు హాజరు కావాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. కోచింగ్ క్యాంపునకు హాజరయ్యేవారు నాలుగు సెట్లు ఎలిజిబులిటీ ఫారమ్స్, స్టడీ, ప్రీవియస్ మార్కులిస్టులు, ఆధార్, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు10వ తరగతి ఒరిజినల్ మార్కు లిస్టు, తమ వెంట తీసుకురావాలన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 28 నుంచి 30 వరకు జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు మురళి 9502074146, మహేంద్ర 9490098136ను సంప్రదించాలని కోరారు.

నిరుద్యోగ వేద పండితులకు నిరుద్యోగ భృతి



రాయచోటి (జగదాంబసెంటర్): వేద విద్యను అభ్యసించిన వేదపండితులకు ప్రభుత్వం నిరుద్యోగభృతి అందించనున్నట్లు అన్నమయ్య జిల్లా దేవాదాయ శాఖ అధికారి సి.విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లాలో గల నిరుద్యోగ వేద పండితుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆయన తెలిపారు. ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ జిరాక్స్, వేదవిద్య ఉత్తీర్ణత పొందిన సర్టిఫికెట్, నిరుద్యోగులమని సెల్ఫ్ డిక్లరేషన్ ఫాంతో సహా పూర్తి వివరాలను ఈ నెల 25వ తేదీలోపు రాయచోటిలోని జిల్లా దేవాదాయ శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆయన తెలియజేశారు.



కూటమి హామీలు... నీటి బుడగలు!

- ప్రభుత్వ తీరుపై ప్రజల మండిపాటు
- అధికారంలోకి వచ్చి వందరోజులైనా హామీల అమలేదీ..?
- మదనపల్లె ప్రాంతంలో టమోటా ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ఊసే లేదు
- కడప–బెంగుళూరు రైలు మార్గం మాట మరిచిన వైనం
- మదనపల్లె మార్కెట్ దత్తత ఎప్పుడో?
- రైల్వేకోడూరులో పరిశ్రమల ఏర్పాటు గాలికే..
- ఎన్నికల వేళ హామీలు ఇచ్చి విస్మరించిన చంద్రబాబు, పవన్



రాజంపేటలో ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు (ఫైల్)

సాక్షి రాయచోటి: అధికారంలోకి రావడం కోసం అడ్డమైన హామీలు ఇచ్చి...తీరా వచ్చిన తర్వాత వాటిని విస్మరించడం చంద్రబాబుకు పరిపాటిగా మారింది. ఏదో చేస్తామని...ఏదేదో ఇస్తామని మాటల గారడీతో బురిడీ కొట్టించి తీరా అధికారంలోకి వచ్చాక హామీలను పూర్తిగా మరచిపోయారు. స్థానిక ప్రజల ఆశలు, ఆకాంక్షలే పెట్టుబడిగా....ఓట్లు వేయించుకున్న కూటమి పెద్దలు ఇప్పుడు నోరు మెదపడం లేదు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు అవుతున్నా ఇప్పటికీ హామీలపై అతీగతీ లేదు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, టీడీపీ నాయకుడు నారా లోకేష్, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌లు ఎన్నికలకు ముందు రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, మదనపల్లె, తంబళ్లపల్లె తదితర ప్రాంతాల్లో పర్యటించారు. బహిరంగ సభల్లో ప్రజలకు మేము అది చేస్తాం..ఇది చేస్తామంటూ హామీలు ఇచ్చారు. వాటి అమలును మాత్రం విస్మరించారు. చేయలేనపుడు చెప్పడమెందుకని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


రైల్వేకోడూరులో పండ్ల పరిశ్రమలు –యువతకు ఉపాధి

రైల్వేకోడూరు కేంద్రంలో మూతపడిన అప్సాపండ్లరసాల పరిశ్రమను తెరిపిస్తామని..రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపడతామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అప్పట్లో చెప్పినా ఇప్పటికీ ఆచరణలో కనిపించడం లేదు. అంతేకాకుండా బొప్పాయి, మామిడి, ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చారు. ఇవేకాకుండా నియోజకవర్గానికి సంబంధించిన అనేక రకాల హామీలు గుప్పించినా అందులో ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదు.

మైనార్టీ జూనియర్ కళాశాల ఏదీ..?

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి ప్రజలకు న్యాయం చేస్తామని, ముస్లిం మైనార్టీలు అధికంగా ఉన్న ఈ ప్రాంతానికి సంబంధించి చిన్నమండెంలో మైనార్టీ జూనియర్ కళాశాల ఏర్పాటుచేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే ఆ విషయంగా ఇప్పటికీ ముందుకు అడుగులు పడలేదు. అంతేకాకుండా సాగునీటి ప్రాజెక్టులైన ఝరికోన, శ్రీనివాసపురం పూర్తి చేస్తామన్నారు.. ఇంతవరకూ అతీ గతీ లేదు. వైఎస్సార్ సీపీ హయాంలో ఏ మేరకు పనులు జరిగాయో అంతవరకే ఉన్నాయి. జిల్లా కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని చెప్పినా నేటికీ అనేక కాలనీల్లో సమస్య తాండవిస్తోంది. ఇలా అధికార పార్టీ పెద్దలు గతంలో ఎన్నో హామీలు ఇచ్చినా నేటికీ నెరవేర్చిన దాఖలాలు లేవు.

మదనపల్లెలో ఏదీ టమోటా ప్రాసెసింగ్ యూనిట్



నారా లోకేష్ ఎన్నికల వేళ తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం వద్ద మాట్లాడారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మార్కెట్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని , టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పి రైతుల కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ అమలుకు కార్యాచరణ కనిపించలేదు.

- మదనపల్లెలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా ఫ్లై ఓవర్ నిర్మిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. కడప–బెంగుళూరు రైలు మార్గం పనులు కూడా అధికారంలోకి రాగానే వేగవంతం చేస్తామని చెప్పి నేటికీ అతీగతీ లేదు. -మదనపల్లెను జిల్లా కేంద్రం చేసి పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు.. ఈ అంశంపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు. మదనపల్లె ప్రజల దాహార్తి తీర్చేందుకు సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల నిర్మాణానికి పూనుకుంటామని చెప్పినా ఇప్పటికీ పునాది రాయి పడలేదు.

అన్నమయ్య డ్యాం.. అంతేనా..?



అధికారంలోకి రాగానే అన్నమయ్య జిల్లాలోని రాజంపేటను జిల్లా కేంద్రంగా చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అంతేకాకుండా వరదలకు కొట్టుకుపోయిన అన్నమయ్య డ్యాం పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టడంతోపాటు వరద బాధితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నా ఇప్పటివరకు డ్యాంకు సంబంధించి పనులు ప్రారంభం కాలేదు. ఇటీవల పవన్ కల్యాణ్ వరద బాధిత గ్రామాల్లో పర్యటించడం మినహా అన్నమయ్య డ్యాంకు సంబంధించి అడుగులు ముందుకు పడలేదు.

జేఎన్టీయూ విద్యార్థులకు ఓరియంటేషన్

పులివెందుల రూరల్: పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాలలో 2024– 2025 కొత్త విద్యా సంవత్సరానికి ప్రవేశం పొందిన మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థుల కోసం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. గురువారం ఉదయం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణ కాంతి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుబ్బారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపల్ అరుణ కాంతి మాట్లాడుతూ విద్యార్థులు కళాశాల వనరులను ఉపయోగించుకుని బాగా చదువుకుని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నా రు. వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుబ్బారెడ్డి మొదటి సంవత్సరం విద్యార్థులకు సంబంధించిన ఆర్–23 రెగ్యులేషన్ సిలబస్, కళాశాల క్రమశిక్షణ, ఇంజనీరింగ్ విద్యపై అవగాహన కల్పించారు.

కాశినాయన వాసికి అరుదైన గుర్తింపు



కడియాల చంద్రబాబునాయుడు

కాశినాయన: అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రకటించిన అత్యంత ప్రతిభావంతులైన టాప్–2 శాస్త్రవేత్తల జాబితాలో వైఎస్సార్ జిల్లా కాశినాయన మండలం ఇటుగుల్లపాడుకు చెందిన కడియాల చంద్రబాబునాయుడు వరుసగా ఐదోసారి చోటు దక్కించుకున్నారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఈయన మెటీరియల్ సైన్స్ విభాగంలో నిరంతరం పరిశోధనలతో డాక్టరేట్ పొందారు. 2018లో గీతం యూనివర్సిటీ బెంగళూరు క్యాంపస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. మెటీరియల్ సైన్స్ విభాగంలోని ఫైరేట్స్, టైటానేట్స్, నాన్ కంపోజిట్ అనే అంశాలపై పరిశోధనలు కొనసాగించారు. పరిశోధన పత్రాలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిశోధనలకు అనుసరిస్తూ సూచించడంలో కడియాలకు గుర్తింపు లభించింది. 2019–20 లో మొదటిసారిగా ర్యాంకును సాధించారు. 2020–21 లోనూ, 2021–22, 2022–23, 2023–24లలో ఉత్తమ ర్యాంకు సాధించారు.

సులభతరంగా ఇసుక బుకింగ్

రాయచోటి: నూతన ఇసుక పాలసీ ప్రకారం ఇసుక ఉచితంగా సులభంగా బుక్ చేసుకునేందుకు ప్రభుత్వం శాండ్ బుకింగ్ పోర్టల్‌ను అమలులోకి తీసుకువచ్చిందని కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం అమరావతి నుండి నూతన ఇసుక పాలసీని వర్చువల్ విధానం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి కలెక్టర్ శ్రీధర్, డీఆర్‌ఓ సత్యనారా యణ, అధికారులు హాజరయ్యారు. ఏపీ శాండ్ పోర్టల్ ద్వారా ఇసుక ఎలా బుక్ చేసుకోవాలనే అంశంపై కలెక్టర్ వివరించారు. వినియోగదారులకు ఉచితంగా ఇసుకను ఇవ్వడమే కాదు, వారు కోరుకుంటే ఆ ఇసుకను వారి ఇంటివద్దకే డెలివరీ చేసే సదుపాయాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు.

స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనకు ప్రణాళికలు

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, విద్య, వైద్య తదితర రంగాలలో 15 శాతం వృద్ధి రేటు సాధించేలా స్వర్ణాంధ్ర–2047 లక్ష్య సాధనకు జిల్లా, మండల స్థాయి ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతి సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ స్వర్ణాంధ్ర–2047 జిల్లా, మండల స్థాయి ప్రణాళికల రూపకల్పనపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో అన్నమయ్య జిల్లా నుంచి కలెక్టర్ శ్రీధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. 15 శాతం వృద్ధి రేటు సాధించేలా ఈ ప్రణాళికలు ఉండాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలలో పరిశ్రమలు, మానవ వనరులు, వైద్య విధానం, నైపుణ్య అభివృద్ధి లక్ష్యాలు, సంక్షేమం తదితర శాఖల్లో ఆచరణ సాధ్యం అయ్యే విధంగా మరింత అభివృద్ధి సాధించే ప్రణాళికలు ఉండాలన్నారు. జిల్లాలో అరటి, బొప్పాయి, మామిడి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, మార్కెటింగ్ అవకాశాలు పెంపొందించడం తదితర అంశాలలో అభివృద్ధి ఎలా సాధించవచ్చన్న ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. వంద రోజులు వార్షిక, ఐదేళ్ల ప్రణాళికలతో ప్రతిశాఖ ప్రణాళికలను తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, డీపీఓ ధనలక్ష్మీ, డ్వామా పీడీ మద్దిలేటి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పుంజుకొన్న టమాటా



మార్కెట్‌లో రవాణాకు సిద్ధంగా ఉన్న టమాటాలు

- మార్కెట్లో కిలో టమాటా రూ.44 నుంచి రూ.48
- వారం రోజులుగా పెరుగుతున్న ధరలు
- బయట రాష్ట్రాల్లో వర్షాలకు దెబ్బతిన్న టమాటాపంట
- జిల్లాలో టమాటా ధరలు పెరగడానికి ఇదే కారణం

గుర్రంకొండ: జిల్లాలోని మార్కెట్లలో టమాటా ధరలు పుంజుకొన్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో టమాటా రూ.44 నుంచి రూ.48 వరకు ధర పలుకుతోంది. గత వారం రోజులుగా టమాటా ధరలు రోజురోజుకు పెరుగుతుండడం గమనార్హం.

- జిల్లా వ్యాప్తంగా ప్రసుతం 1850 మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు మార్కెట్లకు వస్తోంది. దీంతో రాబోయే రోజుల్లో టమాటా ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు అంటున్నాయి.

22,985 ఎకరాల్లో ప్రస్తుత పంట దిగుబడి:

జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీ యార్డు పరిధిల్లో ప్రస్తుతం 22,985 ఎకరాల్లో టమాటా పంట దిగుబడి వస్తోంది. పదిహేనురోజులుగా జిల్లాలో టమాటా పంట దిగుబడి పెరిగింది. గత రెండునెలలతో పోల్చితే ప్రస్తుతం మన జిల్లాలో ముఖ్యంగా పడమటి మండలాల్లో టమాటా పంట దిగుబడి రోజురోజుకు పెరుగుతోంది. నెల రోజుల క్రితం వరకు జిల్లా వ్యాప్తంగా కేవలం 14,675 ఎకరాల్లో మాత్రమే టమాటా పంట దిగుబడి వచ్చింది. అప్పట్లో ధరలు బాగా పుంజుకోవడంతో పాటు ఎండల వేడిమి తగ్గడంతో జిల్లాలోని పడమటి మండలాల రైతాంగం టమాటా పంట సాగుపై దృష్టిసారించింది. దీంతో రోజు రోజుకు పంట దిగుబడి పెరుగుతోంది.

మార్కెట్లో ధరల పెరుగుదల :

ప్రస్తుతం జిల్లాలోని మార్కెట్‌యార్డుల్లో టమాటా ధరలు భారీగా పుంజుకొన్నాయి. వారం రోజుల కిందట 25 కిలోల టమాటాల క్రేట్ ధర రూ.600ల వరకు ధర పలికాయి. బయట రాష్ట్రాల్లో టమాటా పంట దిగుబడులు బాగా వస్తుండడంతో ఇక్కడి టమాటాలకు ధరలు అంతంత మాత్రంగానే ఉండేవి. ప్రస్తుతం వారం రోజులుగా మార్కెట్లో ధరలు రోజురోజుకు పుంజుకొంటున్నాయి. ప్రస్తుతం 25 కేజీల టమాటా క్రేట్ రూ.1100 నుంచి రూ.1200 వరకు ధరలు పలుకుతుండడం గమనార్హం. ప్రస్తుతం మొదటిరకం టమాటా కిలో రూ.48, రెండోరకం కిలో. రూ.38, మూడో రకం రూ.27 వరకు ధరలు పలుకుతున్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా మార్కెట్లకు టమాటాల స్టాకు గణనీయంగా వస్తుండడంతో పాటు బయట రాష్ట్రాల్లో టమాటాలకు డిమాండ్ ఉండడం ధరల పెరుగుదలకు ఒక కారణంగా వ్యాపారులు చెప్పుకొంటున్నారు.

వారం రోజులుగా జిల్లాలోని మార్కెట్లకు వచ్చిన టమాటాల స్టాకు, ధరల వివరాలు..

తేది	స్టాకు (టన్నుల్లో)	ధర (25 కేజీల క్రేట్)
13	1,605	రూ. 745
14	1,563	రూ.820
15	1,638	రూ.875
16	1,687	రూ.970
17	1,745	రూ.1,050
18	1,763	రూ. 1,100
19	1,824	రూ. 1,200

బయట రాష్ట్రాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంట:

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బయట రాష్ట్రాల్లో టమాటా పంట భారీగా దెబ్బతింది. నెలరోజుల వరకు అక్కడి మార్కెట్లకు ఆయా ప్రాంతాల్లోని టమాటాల స్టాకు వచ్చేది. దీంతో ఇక్కడి టమాటాలకు డిమాండ్ తక్కువగా ఉండేది. గత కొన్నిరోజులుగా బయట రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు అక్కడి టమాటా తోటలు బాగా దెబ్బతిన్నాయి. దీంతో బయట రాష్ట్రాల్లో టమాటాలకు డిమాండ్ ఏర్పడడంతో ఇక్కడి టమాటాల ధరలు పుంజుకొన్నాయి. స్థానిక మార్కెట్లకు బయట రాష్ట్రాల నుంచి వ్యాపారులు తరలివచ్చి ఇక్కడి టమాటాలను కొనుగోలు చేసి వారి రాష్ట్రాలకు ఎగుమతి చేసుకొంటున్నారు. బయట రాష్ట్రాల్లో టమాటా పంట దిగుబడులు ప్రారంభమయ్యేవరకు ధరలు రోజురోజుకు మరింత పెరిగే అవకాశముంది.

పెరిగిన స్టాకు:

మన జిల్లాలో నెలరోజుల క్రితం 1435మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు మార్కెట్లకు వచ్చేది. ప్రస్తుతం టమాటా పంటలసాగుతో పాటు దిగుబడులు ఎక్కువగా వస్తున్నాయి. దీంతో జిల్లాలోని టమాటా మార్కెట్లకు ప్రతిరోజు 1824 మెట్రిక్ టన్నుల వరకు స్టాకు వస్తుండడం గమనార్హం.

ధరలు ఆశాజనకంగా ఉన్నాయి



మార్కెట్లలో టమాటా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. వారం రోజులుగా రోజురోజుకూ టమాటా ధరలు పుంజుకొంటున్నాయి. మార్కెట్లో 25 కిలోల టమాటా క్రేట్ ధరలు రూ.1100 నుంచి రూ.1200 వరకు ధరలు పలుకుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లకు టమాటాల స్టాకు పెరుగుతోంది. దీంతో బయట ప్రాంతాల వ్యాపారులు ఇక్కడి మార్కెట్లకు వస్తున్నారు. – కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

పేదలపై ఎందుకంత కళ్ల మంట

- ఆగిన సీఎం ఈ ఐ కేంద్రాల సేవలు
- కళ్లజోడు నమోదు ప్రక్రియకు బ్రేక్
- ప్రభుత్వ నిర్ణయంతో నేత్ర బాధితుల అవస్థలు



మదనపల్లె సిటీ: సంక్షేమ పథకాల అమలుపై ఎన్నికల ముందు బీరాలు పలికిన టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి నేతలు .. అధికారంలోకి వచ్చి వంద రోజులైనా వాటి అమలు ఊసే ఎత్తడం లేదు. ఖజానాలో నిధులు లేవని మూడు నెలలుగా కుంటి సాకులు చెబుతూ వస్తున్న సీఎం చంద్రబాబు గత ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలకు మంగళం పాడటంలో మాత్రం ముందుంటున్నారు. 2017లో టీడీపీ హయాంలో సీఎం ఈ ఐ కేంద్రాల ద్వారా సేవలు ప్రారంభించి అమలులో చేతులెత్తేయగా... 2019లో అధికారం చేపట్టిన వై.ఎస్ జగన్ యథావిధిగా కొనసాగించారు. అయితే పేదలకు మేలు చేసిన సీఎం ఈఐ కేంద్రాలను కూటమి సర్కారు మూతవేసింది. దీంతో నేత్ర పరీక్షలు చేయించుకోలేక, కళ్లజోళ్లు పొందే అవకాశం కోల్పోయిన పేద, మధ్య తరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారు.

పేదలకు సేవలు దూరం..

పేద ప్రజలకు అత్యాధునిక యంత్రాలతో నేత్ర పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు అందించే సీఎం ఈ ఐ కేంద్రాలపై కూటమి సర్కారు వేటు వేసింది. జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల (30 పడకల ఆస్పత్రులు)లో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రాల్లో సేవలను హఠాత్తుగా నిలిపివేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేత్ర పరీక్షలు నిర్వహించడం, రెండు వారాల్లోగా నేరుగా ఇంటి వద్దకే కళ్లజోళ్లు అందించే ప్రక్రియ సజావుగా కొనసాగింది. కాగా కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన మూడు నెలల్లోనే ఈ పథకానికి మంగళం పాడేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉద్యోగుల కొనసాగింపుపై మౌనం..

ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రాల్లో నేత్ర పరీక్షలు చేసి ,ఇతర సేవలు అందించేందుకు రాష్ట్రంలో 250 మందికిపైగా ఉద్యోగులను 2017లోనే ఓ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా నియమించారు. వీరంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనూ కొనసాగారు. ఇందులో కాంట్రాక్టు బేసిక్ కింద అఫ్తాల్మిక్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు. గడిచిన ఏడేళ్లుగా నేత్ర వైద్య సేవలు అందిస్తున్న ఉద్యోగుల కొనసాగింపుపైనా సర్కారు మౌనం వహించడంతో వారిలో ఆందోళన మొదలైంది.

సీఎం ఈ ఐ కేంద్రాలు కొనసాగించాలి



సీఎం ఈ ఐ కేంద్రాలు కొనసాగించాలి. గ్రామీణ ప్రజలు ఎక్కువగా కంటి జబ్బులతో బాధపడుతున్నారు. వీరికి ఈ ఐ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంది. ప్రస్తుతం ఈ కేంద్రాలు మూసివేయడం వల్ల వారు ఇక్కట్లు పడుతున్నారు. – జమాల్‌బాషా, మండల కో ఆప్షన్ సభ్యుడు, తంబళ్లపల్లె

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి



సీఎం ఈ ఐ కేంద్రాలు తిరిగి సేవలు అందించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. గతంలో ఎంతో మంది పేదలకు ఉచితంగా పరీక్షలు చేసి, కంటి అద్దాలు అందజేశారు. దీని వల్ల పేదలందరికీ ఉపయోగకరంగా ఉండేది.– బావానాయక్, సామాజిక కార్యకర్త, తంబళ్లపల్లె

జగన్ ముందు చూపు..



నేత్ర సంబంధిత సమస్యలతో బాధపడే వారికి ఉచితంగా వైద్యం అందించడంపై గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని ఏర్పాటు చేయడంతో పాటు సీఎం ఈ ఐ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు అత్యాధునిక ఫండస్ మిషన్, ఏఆర్ మిషన్లు సమకూర్చారు. ఐ కేంద్రాల్లో ఒక అఫ్తాలమిక్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వీరు పాల్గొని విశిష్ట సేవలు అందించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి రెండు వారాల్లో కళ్లజోళ్లను ఆశా కార్యకర్తల ద్వారా నేరుగా ఇంటి వద్దకే అందించారు. ఈ పథకం కింద గత ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా వేలాది మందికి ఉచితంగా సేవలు అందాయి.

బాబు రాగానే.. పథకం స్టాప్..

వాస్తవానికి ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రాల ప్రాజెక్టును 2017లో టీడీపీ హయాంలోనే ప్రారంభించారు. జిల్లాలో రాయచోటి, రాజంపేట, పీలేరు, తంబళ్లపల్లె సీహెచ్‌సీల్లో ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రాలు పని చేస్తున్నాయి. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం ఈ ఐ కేంద్రాలకు సాంకేతికతను జోడించి మరింత మెరుగులు దిద్ది యథావిధిగా కొనసాగించారు. పేదలకు ఎంతగానో ఉపయోగపడిన ఈ పథకాన్ని కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు, ముఖ్యంగా పేదలకు మేలు చేసే ఈ ఐ కేంద్రాల సేవలను నిలిపివేయడంపై ఆయా వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నేత్ర రుగ్మతలతో బాధపడే వారంతా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి డబ్బు ఖర్చు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కాగా ఈ విషయంపై జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ డేవిడ్ సుకుమార్‌ను వివరణ కోరగా ఈ కేంద్రాలను అపోలో సంస్థ చూస్తుందన్నారు. విషయాలను ఆ సంస్థను అడిగి తెలుసుకుంటానన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్టాండ్‌లో వృద్ధురాలి మృతి



రెడ్డెమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, ఆర్టీసీ అధికారులు

పీలేరురూరల్ : పీలేరు ఆర్టీసీ బస్టాండులో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. కలికిరి మండలం పల్లవోలుకు చెందిన గుర్రంకొండ రెడ్డెమ్మ (70) పీలేరులో యాచకురాలిగా ఉంటూ జీవనం సాగిస్తుండేది. గురువారం ఉదయం పీలేరు ఆర్టీసీ బస్టాండులో మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న బస్టాండ్ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆమె బంధువులకు సమాచారం అందించారు. బంధువులు వచ్చి ఆమె మృతదేహాన్ని తీసుకెళ్లారు.

మందుల షాపులు ఆకస్మిక తనిఖీ



రామసముద్రంలో మందుల షాపులో తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ కేశవరెడ్డి

రామసముద్రం : మండల కేంద్రంలోని మందుల షాపులను మదనపల్లె డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కేశవరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మత్తుమందు కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన రికార్డులు, మత్తుమందుల తయారీ తేదీ, కాలవ్యవధి తేదీలను పరిశీలించారు. నకిలీ మందులు, కాలం తీరిన మందులు అమ్మితే లైసెన్సులు రద్దు చేయడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

కురబలకోట : మండలంలోని వేర్వేరు గ్రామాల్లో ఇద్దరు గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మండలంలోని బలకవారిపల్లెకు చెందిన కరీమున్నీసా కడుపు నొప్పి తాళలేక జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగింది. అదే విధంగా కొంగావారిపల్లెకు చెందిన సుధాకర్ రెడ్డి (21) కుటుంబ సభ్యులతో గొడవపడి పురుగుమందు తాగాడు. హుటాహుటిన వీరిద్దరిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు పోలీసులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం బండ్లవంకకు చెందిన కృష్ణానాయక్ భార్య మూడే నీలావతమ్మ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 18న నీలావతమ్మ సొంత స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టేందుకు కె.రవి, కె.నాగరత్నమ్మ, వారి కుమార్తె కవిత దారి కోసం గొడవకు దిగి కులం పేరుతో దూషించారని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేడుకగా యువజనోత్సవం

కడప స్పోర్ట్స్ : యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాలు గురువారం వేడుకగా సాగాయి. కడప నగరంలోని స్పిరిట్స్ విద్యాసంస్థల్లో నిర్వహించిన ఈ ఉత్సవాలను డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, సెట్ప్ సీఈఓ సి. సాయిగ్రేస్, నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ మణికంఠ ప్రారంభించారు. తొలుత స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యువత తమలోని నైపుణ్యాలను ప్రదర్శించేందుకు చక్కటి వేదిక యువజనోత్సవాలు అని పేర్కొన్నారు. డాక్టర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ యువత తలుచుకుంటే సాధించలేనిది లేదన్నారు. సెట్ప్ సీఈఓ సి. సాయిగ్రేస్ మాట్లాడుతూ జనవరి 12న స్వామి వివేకానందుని జయంతి వేడుకలు పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ మణికంఠ, కళాశాల డైరెక్టర్ రవీంద్ర, స్థానిక 16వ డివిజన్ కార్పొరేటర్ లక్ష్మీదేవి మాట్లాడారు. అనంతరం వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. కార్యక్రమంలో సెట్ప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, సిబ్బంది నారాయణ, నాగయ్య, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

విజేతల వివరాలు..

(ప్రథమ, ద్వితీయస్థానాలు వరుసగా)

కవిత్వం : బి. దస్తగిరి, ఎస్. సురేఖ

డెక్లమేషన్ : ఎస్. సమీన, ఎస్. ఆర్షియాఅహ్మద్

స్టోరీ రైటింగ్: ఎస్.సానియా, ఎస్. జెబా

పెయింటింగ్: వి.హరినాయక్, టి.చంద్రభాను

ఫోక్ డాన్స్ (గ్రూప్): పెయ్యల యశ్విత టీం, జయచంద్ర టీం

ఫోక్ డాన్స్ (సోలో): ఎన్. ఉషోదయ, టి. సుధేష్ణ

ఫోక్ సాంగ్ (సోలో): కె. మురళీమోహన్, డి. అనూష,

ఫోక్ సాంగ్ (గ్రూప్): ఎం. గణేష్.



జానపద నృత్య ప్రదర్శనలో యువతులు



జానపద నృత్య ప్రదర్శన చేస్తున్న యువత

వరద బాధితులకు న్యాయం చేస్తాం

నందలూరు : అన్నమయ్య డ్యామ్ తెగి వచ్చిన వరదలలో నష్టపోయిన బాధితులకు న్యాయం చేస్తామని సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి తెలిపారు. గురువారం మండలంలోని పాటూరు సచివాలయం, అరవపల్లి షాదిఖానా, లేబాక సచివాలయాలలో బాధితల నుంచి తహసీల్దార్ అమర్‌నాథ్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వరద బాధితులు ఆస్తి, పశు నష్టానికి సంబంధించి ఇంతవరకు నష్ట పరిహారం అందలేదని అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, సర్పంచ్‌లు అక్కిరెడ్డి మోహన్ రెడ్డి, ఆర్ఐ సుశీల్ కుమార్, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



బాధితుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి

యాప్‌లను రద్దుచేసి పనిభారాన్ని తగ్గించాలి

రాయచోటి అర్బన్ : జిల్లాలో ఐసీడీఎస్ అధికారులు అమలు చేస్తున్న నోట్‌కామ్ యాప్‌లను వెంటనే రద్దు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కో–కన్వీనర్ సరోజమ్మ మాట్లాడుతూ ఏ జిల్లాలో లేని విధంగా అన్నమయ్య జిల్లాలో నోట్‌కామ్ యాప్‌ను నిర్వహించాలంటూ కలెక్టర్ ఆదేశించారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు వెంటనే కొత్తఫోన్‌లను, 5జి సిమ్‌లను అందజేయాలన్నారు. అనంతరం ఈమేరకు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు భారతి, జయలక్ష్మి, వనిత తదితరులు పాల్గొన్నారు.

మెస్, కాస్మోటిక్ చార్జీలను చెల్లించాలి

రాయచోటి అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రభుత్వ గృహాలలో పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే చెల్లించాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం (పిఆర్ఎస్‌వైఎఫ్) రాష్ట్రనేత నాగేంద్ర బాబు, జిల్లా కన్వీనర్ వెంకటరమణ డిమాండ్ చేశారు. బిల్లుల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గురువారం మాసాపేటలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతిగృహం–3 ఎదుట విద్యార్థులతో కలసి ప్రదర్శన చేశారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే మరోవైపు అరకొరగా అందిస్తున్న మెస్‌చార్జీలను నెలల తరబడి చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు.



మెస్‌చార్జీలు చెల్లించాలంటూ హాస్టల్ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సంబేపల్లె : రోడ్డు ప్రమాదంలో చల్లా రాజా (24) అనే యువకుడు మృతి చెందిన సంఘటన సంబేపల్లె మండలంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు మండల పరిధిలోని దేవపట్లకు చెందిన రాజా రాయి కొట్టుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో రాతి కొట్టడం పని ముగించుకొని బైకులో వస్తుండగా దేవపట్ల ఎస్టీ కాలనీ సమీపంలో చిత్తూరు– కర్నూలు జాతీయ రహదారిపై ఆగి ఉన్న రాయచోటి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రాజ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య దీపిక, కూతురుతో పాటు బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



మృతి చెందిన రాజా

హోంగార్డ్స్ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

రాయలసీమ రీజినల్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం. మహేష్ కుమార్

మదనపల్లె : హోమ్ గార్డ్స్ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని రాయలసీమ రీజినల్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం. మహేష్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలోని పరేడ్ మైదానంలో హోంగార్డ్స్ పరేడ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డ్స్, పోలీస్ శాఖతో పాటు పలు ప్రభుత్వ శాఖల్లో పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తూ ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుంటున్నారన్నారు. విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, సమస్యను సకాలంలో గుర్తించి చికిత్స పొందాలన్నారు. హోంగార్డ్స్ తమ సమస్యలను కమాండెంట్ ఎం.మహేష్ కుమార్ దృష్టికి తీసుకురాగా, ఉన్నతాధికారులతో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ బి. చిన్నికృష్ణ, హోంగార్డ్స్ రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ జి. వెంకటాచలపతి, మదనపల్లి సబ్ డివిజన్ హోంగార్డ్స్ ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబుల్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



హోంగార్డ్స్ పెరేడ్‌లో సూచనలిస్తున్న రాయలసీమ రీజినల్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్

గంజాయి కలిగి ఉన్న వ్యక్తి అరెస్టు

చిట్వేలి : మండల పరిధిలోని నగిరిపాడు గొల్లపల్లికి చెందిన గంధం ప్రసాద్ (63) గంజాయి ప్యాకెట్లు కలిగి ఉండటంతో ఈనెల 18వ తేదీ అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైల్వేకోడూరు ప్రధాన రహదారి, గొల్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద చేతిలో తెల్ల సంచి కలిగి పోలీసులను చూసి పారిపోతుండగా నిందితుడిని అదుపులోకి తీసుకొని గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే అతని చొక్కాలో దాచి ఉంచిన గంజాయి కొమ్మలను స్వాధీనం చేసుకున్నారు. వీటి మార్కెట్ విలువ రూ. 16, 250లు ఉంటుందని అంచనా వేశామన్నారు. నిందితుడిని గురువారం రాజంపేట కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ వెల్లడించారు.

అక్రమంగా ఇసుక తరలింపుపై కేసు నమోదు

గాలివీడు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గాలివీడు ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. గురువారం కొందరు అక్రమార్కులు అనుమతులు లేకుండా తలముడిపి గ్రామం పాపాఘ్ని నది నుంచి గాలివీడుకు ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తుండగా పసలవాండ్ల పల్లె వద్ద పట్టుకున్నారు. రవీంద్ర అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు

సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

నిమ్మనపల్లె : విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. గురువారం మండలంలోని ముష్టూరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. పదార్థాల నాణ్యతను మెచ్చుకున్నారు. పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కేజీబీవీ పాఠశాల, ప్రహరీ నిర్మాణానికి ఇంజినీరింగ్ అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయించి అందించాలని ప్రిన్సిపాల్ మునివెంకటమ్మను ఆదేశించారు. పాఠ్యాంశాల బోధనపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రేపటి భవిష్యత్తుకు పునాదులన్నారు. క్రమశిక్షణతో చదువుకొని చక్కని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు.



కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘా స్వరూప్

రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలి

రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. గురువారం మండల రెవెన్యూ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తహసిల్దార్, సర్వేయర్లు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ రికార్డుల నిర్వహణ, ప్రజల సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను తహసీల్దార్ ధనుంజయలను అడిగి తెలుసుకున్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలో 16 పతకాలు

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని 16 పతకాలు సాధించినట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. ఈనెల 14, 15 తేదీల్లో అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో తమ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి పతకాలను సాధించారన్నారు. అలాగే రెండు టీంలలో ఛాంపియన్ షిప్‌లను కై వసం చేసుకున్నారన్నారు. పతకాలు సాధించడం పట్ల డైరెక్టర్‌తోపాటు అకడమిక్ డీన్ రత్నకుమారి, అధ్యాపక బృందం, కోచ్ బాల గోవింద తివారి, పీడీలు ఓబయ్య, శంషాద్ బేగం తదితరులు విద్యార్థులను అభినందించారు.

కారు ఢీకొని..

వాల్మీకిపురం : కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని విఠలం సమీపంలోని పాదాలగుడి వద్ద గురువారం చోటు చేసుకొంది. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. పీలేరు సరోజిని వీధికి చెందిన సయ్యద్ రహమతుల్లా (35), వసీఫ్ అహమ్మద్ (13) పీలేరు నుంచి బైకులో హార్సిలీహిల్స్‌కు బయల్దేరారు. మార్గమధ్యంలో మదనపల్లి నుంచి తిరుపతికి వెళ్తున్న కారు వాల్మీకిపురం మండలం విఠలం పాదాల గుడి వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో సయ్యద్ రహమతుల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. వసీఫ్ అహమ్మద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు.



మృతి చెందిన సయ్యద్ రహమతుల్లా

లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

మదనపల్లె : తమిళనాడుకు చెందిన ఓ లారీడ్రైవర్ తీవ్ర గాయాలతో రైల్వేట్రాక్‌పై పడిన సంఘటన బుధవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. తమిళనాడు నామక్కల్‌జిల్లా తంగగిరికి చెందిన లారీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం(54) తీవ్రగాయాలతో మదనపల్లె మండలం సీటీఎం ఆంజనేయస్వామి గుడి సమీపంలోని రైల్వేట్రాక్‌పై పడి ఉండగా, గురువారం ఉదయం స్థానికులు, రైల్వేసిబ్బంది గుర్తించారు. 108కు సమాచారం అందించడంతో బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతడి వివరాలు విచారించగా తాను కదిరిలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నానని, బుధవారం రాత్రి రైలులో వెళుతుండగా, ప్రమాదవశాత్తు సీటీఎం వద్ద పడిపోయినట్లు చెప్పాడు. స్థానిక వైద్యులు చికిత్స అందించగా కోలుకుంటున్నాడు. అతడి కుటుంబ సభ్యులకు పోలీస్ అవుట్‌పోస్ట్ సిబ్బంది సమాచారం అందించారు.



గాయపడిన తమిళనాడు లారీడ్రైవర్

ద్విచక్రవాహనం ఢీకొని..

ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన సంఘటన బుధవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గణేష్‌సాహు(26) రెండు నెలల క్రితం ఉపాధి కోసం మదనపల్లెకు వచ్చాడు. స్థానికంగా కూలిపనులకు వెళుతున్నాడు. బుధవారం రాత్రి పుంగనూరు రోడ్డులో నడుచుకుంటూ వెళుతుండగా, గుర్తుతెలియని ద్విచక్రవాహనం అతడిని ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో బాధితుడు తీవ్రంగా గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పాము కాటుతో మహిళ మృతి

మదనపల్లె : పాము కాటుతో మహిళ మృతి చెందిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. దుబ్బిగానిపల్లె పంచాయతీ గొల్లపల్లికు చెందిన శ్రీనివాసులు భార్య రమాదేవి (40) పొలం వద్ద కలుపు తీస్తుండగా, అకస్మాత్తుగా మహిళ చేతిపై పాము కాటు వేసింది. పాము కాటుకు గురైన సంగతి వెంటనే ఆమె కుటుంబ సభ్యులకు తెలిపింది. వారు హుటాహుటిన బాధితురాలిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే పరీక్షించిన అత్యవసర విభాగ వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో అప్పటికే పెద్ద ఎత్తున ఆసుపత్రికి చేరుకున్న మృతురాలి బంధువులు కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంతో మృతదేహాన్ని తిరిగి స్వగ్రామానికి తరలించారు. కాగా ఆమెకు ఒక కుమారుడు ఉండగా అతను సైతం ఏడాది క్రితం చెరువులో మునిగి మృతి చెందాడు.



పాముకాటుతో మృతి చెందిన రమాదేవి

పోస్టుమాస్టర్‌పై ఫిర్యాదు

కాశినాయన : మండలంలోని నరసాపురం పోస్టుమాస్టర్‌పై ఖాతాదారులు నరసాపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఖాతాదారులకు చెందిన దాదాపు రూ.20 లక్షల నగదును దారి మళ్లించారు. ఖాతాదారుల పుస్తకాల్లో జమ చేస్తూ పోస్టాఫీసు రికార్డుల్లో జమచేయలేదు. ఈ విషయం జిల్లా పోస్టల్ అధికారులకు ఖాతాదారులు తెలియజేయడంతో పది రోజుల క్రితం పోస్టాఫీసుకు వచ్చి విచారణ చేపట్టారు. అవకతవకలు జరిగింది వాస్తవమేనని, పూర్తి విచారణ చేపడతామన్నారు. అయితే పోస్టుమాస్టర్ నాయక్ సెలవులో వెళ్లారు. దీంతో ఖాతాదారులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం





రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన యువకుడు. తల, మొండెం వేరుపడిన దృశ్యం



దెబ్బతిన్న వాహనం

- కర్ణాటక సరిహద్దులో దుర్ఘటన
- మృతుడు మదనపల్లె వాసిగా అనుమానం
- సంఘటన స్థలంలో వేరైన తల, మొండెం

మదనపల్లె: గుర్తుతెలియని వాహనం ఢీకొని మదనపల్లెవాసి కర్ణాటక రాష్ట్ర సరిహద్దు రాయల్పాడు వద్ద దుర్మరణం పాలైన సంఘటన గురువారం రాత్రి జరిగింది. మదనపల్లె మండలం సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు వద్ద రాత్రి 10:30 గంటలకు గుర్తుతెలియని వాహనం కర్ణాటక వైపు నుంచి ద్విచక్ర వాహనంలో మదనపల్లికి వస్తున్న ఓ యువకుడిని ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో సుమారు 25–30 సంవత్సరాల వయసుగల యువకుడి తల మొండెం వేరుపడి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న రాయల్పాడు పోలీసులు యువకుడి ఆచూకీ కోసం విచారించారు. ప్రమాద స్థలం మదనపల్లె –బెంగళూరు జాతీయ రహదారిపై జరగడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. వాహనాలు భారీగా నిలిచిపోయాయి. యువకుడు వస్తున్న ద్విచక్ర వాహనం నంబర్ ఏపీ 39 ఎఫ్ యు 1825 మదనపల్లె ఆర్టీఓ పరిధిలో రిజిస్ట్రేషన్ అయి ఉండడంతో, మృతి చెందిన యువకుడు మదనపల్లికి చెందినవాడై ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతి చెందిన యువకుడు కర్ణాటక నుంచి మద్యం తరలిస్తున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

స్కౌట్స్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ

రాయచోటి టౌన్ : ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ తప్పనిసరి చేయాలని తద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐక్యతా భావం పెరుగుతుందని జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి అన్నారు. గురువారం రాయచోటి బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్లకు ప్రారంభ కోర్సును ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిట్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రారంభ శిక్షణ తరువాత మాస్టర్లకు, గైడ్ కెప్టెన్లకు సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రేఖ, సుండుపల్లె జెడ్పీహెచ్ఎస్ స్కూల్ హెచ్ఎం జయన్న, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, రాయచోటి డివిజన్ పరిధిలోని అన్ని మండలాల పాఠశాలలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి

గిరిజన విద్యార్థులు అభివృద్ధి చెందాలి

పీలేరు : గిరిజన విద్యార్థులు విద్యలో రాణించి అభివృద్ధి చెందాలని ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. గురువారం స్థానిక కోటపల్లెలోని ఎస్టీ గురుకుల బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. పాఠశాలలో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులతో ముఖా ముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గురుకుల పాఠశాలకు సొంత బిల్డింగ్ లేకపోవడంతో అద్దె భవనంలో అరా కొరా వసతులతో నడుస్తోందన్నారు. పక్కా భవనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీటీడబ్ల్యూఓ తేజశ్వని, తహసీల్దార్ భీమేశ్వర్ రావు, ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు, ఎంఈఓ పద్మావతి, ఎస్ఐ బాలకృష్ణ, సూపరింటెండెంట్ సతీష్, సీడీపీఓ రాజమ్మ, ఏఐటీయూసీ నాయకుడు టి.ఎల్. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్‌నాయక్